సాక్షి ఆదిలాబాద్

గురువారం । 12 । జూన్ । 2025



భక్తిశ్రద్ధలతో 'వటసావిత్రి' పూజలు

జిల్లా వ్యాప్తంగా వట సావిత్రి వ్రత పూజలను మహిళలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద సందడి కనిపించింది. 9లో▸



అందని 'ఉపాధి' కూలి 9లో▸

ఉపాధి హామీ పథకంలో కూలీలకు రెండు నెలలుగా కూలి అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

12 ఏళ్ల తర్వాత మళ్లీ ఓపెన్



మూతపడ్డ వెంకట్‌రావ్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో సోమయ్య

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకట్‌రావు కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 2013లో మూతబడింది. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటంతో నాడు ఆ బడికి తాళం పడింది. ఆ తర్వాత ఆ కాలనీకి చెందిన తల్లిదండ్రులు పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలలు, సమీపంలోని ప్రభుత్వపాఠశాలలకు పంపించారు. దీంతోఈపాఠశాల 12 ఏళ్లుగా తెరుచుకోలేదు. ఈ (2025–26) విద్యా సంవత్సరంలో పునః ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీలో ఇటీవల నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా అధికారులు సర్వే చేపట్టడంతో 28 మంది విద్యార్థులను తల్లిదండ్రులు ఇందులో చేర్పించేందుకు ముందుకొచ్చారు. దీంతో ఆదిలాబాద్‌అర్బన్ మండల విద్యాధికారి సోమయ్య బుధవారం పాఠశాలను సందర్శించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను సిద్ధం చేశారు. పాఠశాలలో మరమ్మతు పనులను చేపట్టారు. విద్యార్థుల సంఖ్య 40కి పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు.

మూత బడుల ఓపెన్‌కు చర్యలు : డీఈవో

జిల్లాలో 14 పాఠశాలలు మూతబడ్డాయి. వీటిని తెరిపించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఖుర్షాపూర్, స్టేషన్ రోడ్, వెంకట్‌రావుపేట్, కేఆర్‌కే హిందీ మీడియం, బజార్‌హత్నూర్ మండలంలోని ఇందిరానగర్, భీంపూర్‌లోని పిప్పల్‌కోటి ఉర్దూ మీడియం, గాదిగూడలోని చిన్నుకుండి, కునికాస, ఇచ్చోడ మండలంలోని తలమద్రి, నార్నూర్‌లోని భీంపూర్ ఎస్సీకాలనీ,నేరడిగొండలోని దాబా, సావర్గాం పాఠశాలలు కొన్నేళ్లుగా మూతబడ్డాయి. ఇందులో నాలుగింటిని ఈ విద్యా సంవత్సరంలో పునఃప్రారంభిస్తుండగా, మిగతా వీటిని సైతం తెరిపించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

'కప్పర్ల'లో ప్రవేశాల జోరు

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏటా 100కు పైగా అడ్మిషన్లు అవుతున్నాయి. మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందుతుండటంతో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే బడిబాటలో భాగంగా 50కి పైగా అడ్మిషన్లు పూర్తయినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు కిష్టన్న తెలిపారు. ఈ ఏడాది కూడా వంద దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు.



జిల్లా కేంద్రంలోని మరాఠీ మీడియం పాఠశాలను బెలూన్‌లతో ముస్తాబు చేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి ఫోకస్

చలో బడి

- నేటి నుంచి పునఃప్రారంభం
- ముస్తాబైన పాఠశాలలు
- సిద్ధమైన విద్యార్థులు
- తొలిరోజే యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు

డీఈవో పరిధిలోని పాఠశాలలు: 739
ప్రాథమిక :500, యూపీఎస్:119
హైస్కూళ్లు:120

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల వివరాలు..

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
లోకల్‌బాడీ	673	47,809
కేజీబీవీ	18	4,331
మోడల్ స్కూళ్ల్స్	06	3,962
యూఆర్ఎస్	01	101
ప్రైవేట్ స్కూల్స్	162	48,931
ఎయిడెడ్	02	202
సోషల్ వెల్ఫేర్	03	1,762
ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ	13	4,609
ట్రైబల్ వెల్ఫేర్	540	19,369
మహాత్మా జ్యోతిబాఫూలే	07	2,916
మైనార్టీ రెసిడెన్షియల్	06	1,848
మొత్తం	1,471	1,46,880

పాఠశాలలు ముస్తాబు..

వేసవి సెలవుల తర్వాత నేడు పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు బడులను ఇప్పటికే ముస్తాబు చేశారు. ఆవరణ, పరిసరాలను శుభ్రంగా మార్చారు. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు మామిడి తోరణాలు, కొన్ని పాఠశాలల్లో బెలూన్‌లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.ఇక ఇటీవల బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1వ తరగతిలో చేర్పించేందుకు 1286 ఎన్‌రోల్‌మెంట్ చేశారు. వివిధ ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 115 మంది విద్యార్థులను చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి వరకు చదివిన విద్యార్థులు 6వ తరగతిలో చేరేలా ప్రణాళికలు రూపొందించారు. బడిబాటలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2,556 మందిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించనున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఇన్నిరోజులు వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన చిన్నారులు ఇక బడిబాట పట్టనున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారంతా తిరిగి ఇంటికి చేరారు. ఐడీ కార్డు, టై, బెల్టు, షూ, వాటర్ బాటిల్, నోట్ బుక్స్‌వంటివి సిద్ధం చేసుకొని ఇప్పటికే బ్యాగులు సర్దుకున్నారు. నేటి నుంచి బడి గంట మోగనుండగా.. ఇన్నిరోజులు బోసిపోయిన పాఠశాలఇక విద్యార్థులతో సందడిగా మారనుంది. ప్రభుత్వ బడులను ఇప్పటికే సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు మామిడి తోరణాలు వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఈ ఏడాది సర్కారు పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, మన ఊరు–మనబడి ద్వారా సౌకర్యాలపై ఫోకస్ పెంచింది. తాగునీరు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీలు, విద్యుత్ సౌకర్యం వంటివి కల్పించారు. పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

తొలిరోజే యూనిఫాం, పాఠ్య పుస్తకాలు..

పాఠశాలలు తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాకు 4లక్షల 83వేల 110 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, ఇప్పటివరకు 4లక్షల 60వేల 931 చేరుకున్నాయి. ఆయా మండల కేంద్రాలకు పాఠ్య పుస్తకాలను సరఫరా చేయగా, అక్కడి నుంచి సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు స్కూళ్లకు తీసుకెళ్లారు. అలాగే యూనిఫాం కూడా అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. 66,282 మంది విద్యార్థులకు యూనిఫాం అందించాల్సి ఉండగా, 63 శాతం కుట్టడం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. పాఠశాలలకు 56 శాతం యూనిఫాం చేరుకున్నాయని పేర్కొంటున్నారు. మిగితావి త్వరలోనే అందించనున్నట్లు చెబుతున్నారు. మొదటిరోజు కొంత మంది విద్యార్థులకు ఒక జత యూనిఫాం అందించనున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో ప్రైవేట్‌కు దీటుగా కొన్ని సర్కారు బడుల నిర్వహణ కొనసాగుతుంది. ఇంద్రవెల్లి జెడ్పీఎస్ఎస్‌లో 1,112 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ఇచ్చోడలో 1,096, బేల ఉన్నత పాఠశాలలో 582, జైనథ్ ఉన్నత పాఠశాలలో 566, ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నం.1 పాఠశాలలో 525 మంది, సొనాల ఉన్నత పాఠశాలలో 518 మంది, యాపల్‌గూడ ఉన్నత పాఠశాలలో 418 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఇచ్చోడలోని కేశవపట్నంలో 309 మంది, ఎంపీపీఎస్ యాపల్‌గూడలో 298 మంది, ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్ పాఠశాలలో 277, సిరి కొండ ప్రాథమిక పాఠశాలలో 209, భీంపూర్ మండలం నిపానిలో 105 మంది విద్యార్థులున్నారు.



చదువుతో పాటు లోకజ్ఞానం నేర్పేవారు..



ఆదిలాబాద్‌టౌన్: నేను ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నం.1 పాఠశాలలో చదివాను. మా గురువులు బాపురావ్, నారాయణ, సదాశివ్ మాస్టార్, రాఘవరావ్ చదువుతో పాటు లోకజ్ఞానం నేర్పించారు. నైతిక విలువల గురించి తెలియజేశారు. తప్పనిసరిగా ఆటలు, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు, క్రాఫ్ట్ విద్య నేర్పించారు. మాలో ఉన్న ప్రతిభను గుర్తించి అవసరమైన సూచనలు చేసేవారు. గురువులంటే భయం, భక్తి ఉండేది. పాఠశాలకు హుషారుగా వెళ్లేవాడిని.
– జయచంద్ర కుమార్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి

బడికి వెళ్తానని ఏడ్చేవాడిని..



ఆదిలాబాద్‌టౌన్: మాది నేరడిగొండ మండలంలోని చిన్నబుగ్గారం. మేము ముగ్గురం అన్నదమ్ములం. నేను చిన్నవాడిని. 1, 2వ తరగతులు మా ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. ఆ తర్వాత నన్ను చదువు మానేసి వ్యవసాయ పనులు చేయాలని ఇంట్లో అన్నారు. నేను ఏడవడంతో మా పెద్దనాన్న సొనాలలోని పాఠశాలలో చేర్పించారు. అక్కడ 3,4 తరగతులు చదివాను. 5 నుంచి 10వ తరగతి వరకు నిర్మల్‌లోని జుమెరాత్‌పేటలో చదివాను. మొదటి రోజు మా నాన్న నన్ను బడిలో చేర్పించారు. ఆరోజు ఏడ్చుకుంటూ వెళ్లాను.
– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

స్కూల్‌కు వెళ్లేందుకు మారాం చేసేవాడిని..



ఆదిలాబాద్‌టౌన్: మాది నార్నూర్ మండలంలోని భీంపూర్ గ్రామం. ఊరిలోనే 1 నుంచి 8వ తరగతి వరకు చదివాను. చిన్నప్పుడు బడికి వెళ్లేందుకు మారాం చేసేవాడిని. నాన్న శంకర్, కుటుంబ సభ్యులు బడికి తీసుకెళ్లేవారు. టీచర్లు బాగా చెప్పేవారు. ఆ తర్వాత 10వ తరగతి వరకు బెల్లంపల్లి రెసిడెన్షియల్‌లో చదివాను. సర్కారు బడిలో అన్ని వసతులుంటాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా అందులోనే చదివించాలి.
– డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

మొదట్లో భయం వేసేది..



బోథ్: మాది సొనాల మండలంలోని గుట్టపక్కతండా. చిన్న గ్రామం. నా చిన్నప్పుడు మా ఊరిలో బడి లేదు. సొనాలకే పోవాల్సి వచ్చేది. ఒకటి నుంచి పదో తరగతి వరకు అక్కడే ప్రభుత్వ పాఠశాలలో చదివా. మొదట్లో స్కూల్‌కు వెళ్లాలంటే కొంత భయం వేసేది. ఆ సమయంలో మా మాన్‌సింగ్ సార్ చొరవ చూపారు. ఆయన ప్రోత్సాహం మరువలేనిది. ఇప్పుడు ఈ స్థాయిలో స్థిరపడ్డానంటే కారణం అప్పుడు ఆ బడిలో విలువలతో కూడిన విద్య అందించడమే. – తగిరె ప్రతాప్‌సింగ్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉట్నూర్

సర్కారు బడిలో జీవిత పాఠాలు..



బోథ్: మాది సొనాల. అమ్మానాన్న చదువుకోలేదు. నా విద్యాభ్యాసం ఒకటి నుంచి పీజీ వరకు అంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే. మా ఊరిలో చాలా మంది విద్యావంతులు, ఉద్యోగస్తులు ఉన్నారు. వారిని చూసి ఎలాగైనా సర్కారు కొలువు కొట్టాలని చిన్నప్పటి నుంచే అనుకునే వాడిని. సార్లు చెప్పే విషయాలపై ఆసక్తి ఉండేది. వారిలాగా పాఠం చెప్పాలని అప్పుడే అనుకున్నా. ఆ కల నెరవేర్చుకున్నా. సర్కారు బడిలో పుస్తక పాఠాలే కాదు జీవిత పాఠాలు నేర్పుతారు. – రడాపు సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఆదిలాబాద్

అక్కలతో కలిసి బడికి వెళ్లేది..



నేరడిగొండ: మాది జగిత్యాల జిల్లా గోపాల్‌రావు పేట గ్రామం. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. ఇంటర్ ట్రిపుల్‌ఐటీ బాసరలో పూర్తి చేశా. చిన్నప్పుడు ఇద్దరక్కలతో కలిసి బడికి వెళ్లేవాడిని. ప్రైవేట్‌తో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని నా అభిప్రాయం.
శ్రీకాంత్, నేరడిగొండ ఎస్సై

న్యూస్‌రీల్

ఎడ్లబండిపై వెళ్లి.. సాగు పనులు పరిశీలించి



ఎడ్లబండిపై వెళ్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌రూరల్: పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాపల్‌గూడ శివారులో సాగు పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం పరిశీలించారు. చేలకు వెళ్లే మార్గం బురదమయంగా ఉండడంతో స్వయంగా ఎడ్ల బండిపై వెళ్లారు. పొలాలకు రోడ్లు సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట అధికారులు, బీజేపీ నాయకులు తదితరులున్నారు.

అతివలకు అండగా షీ టీం

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో అతివలకు షీటీం బృందాలు అండగా నిలుస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా సంస్థలు పునఃప్రారంభమవుతున్న సందర్భంలో మహిళలు, విద్యార్థినులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పాఠశాలలు, కళాశాలల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని షీ టీం బృందాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. గత నెలలో 114 గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అలాగే పట్టణంలోనూ 14 చోట్ల నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి సందర్భంలోనైనా మహిళలు షీ టీం బృందాన్ని 8712659953 నంబర్‌పై సంప్రదించవచ్చని సూచించారు.

'సాక్షి'పై దాడి సిగ్గుచేటు



జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

- ఏపీ ప్రభుత్వ తీరుపై జర్నలిస్టుల నిరసన

కైలాస్‌నగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించేలా అక్కడి 'సాక్షి' కార్యాలయాలపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటని పలువురు జర్నలిస్టులు మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు, సాక్షి కార్యాలయాలపై అల్లరి మూకల దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు బుధవారం నిరసన తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ నుంచి తెలంగాణ చౌక్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. అనంతరం చౌక్‌లోని రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘాల నాయకులు మెడపట్ల సురేశ్, నూకల దేవేందర్, బేత రమేశ్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న సాక్షి పత్రికపై కక్షకట్టి కార్యాలయాలపై దాడులు చేయించడం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ జి.కృష్ణకాంత్‌గౌడ్, ఆర్సీ ఇన్‌చార్జి యేర సుధాకర్, చింతల అరుణ్‌రెడ్డి, కె.జైపాల్, గంట వినోద్, నంద సురేష్, సీనియర్ జర్నలిస్టులు సారంగపాణి, ఫెరోజ్ ఖాన్, బి.వెంకటేశ్, సత్యనారాయణ, దేవిదాస్, రాజు ముదిరాజ్, కిరణ్ రెడ్డి, సిడాం రవి, వెంకటేశ్, అభిలాష్, లాయర్ ప్రవీణ్, మహేందర్, సతీష్ రెడ్డి, కార్తీక్, నరేష్, మహేష్, రవి, సతీష్‌రెడ్డి, పిట్ల రాము, గజానన్, కె.ప్రమోద్, కార్తీక్, పొచ్చన్న, మల్లయ్య, మురళీకృష్ణ, సుభాష్, అస్మత్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'ఉదారి'కి సారస్వత పరిషత్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఉదారి నారాయణ

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఉదారి నారాయణకు సారస్వత పరిషత్ పురస్కారం వరించింది. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో అందజేసే ఈ పురస్కారాన్ని బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. పురస్కారంతోపాటు రూ.20వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా కవులు నారాయణకు అభినందనలు తెలిపారు.

మంత్రి వివేక్‌కు కార్మిక, మైనింగ్ శాఖలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర మంత్రి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు శాఖలు కేటాయించారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలతోపాటు గనులు, జియాలజి శాఖలు కేటాయించారు. కాగా, గతంలో చెన్నూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన సోదరుడు వినోద్ కూడా కార్మిక శాఖ మంత్రిగా పని చేయడం గమనార్హం.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వం కల్పించే ఉచిత విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా దళిత అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన మెరిట్ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపికైన 26 మంది విద్యార్థులకు బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కాలేజ్ అలాట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. అంతకుముందు విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా శాఖల అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి, సూపరింటెండెంట్ పూర్ణచందర్, ఎస్సీకార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు, ఏఎస్‌డబ్ల్యూవో నారాయణరెడ్డి పాల్గొన్నారు.


అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. మండలంలోని తడిహత్నూర్ సబ్‌సెంటర్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం నార్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యురాలు సుమలత తదితరులు ఉన్నారు.

'సహజ' వ్యవసాయం

- కేంద్ర ప్రభుత్వం కొత్త విధానం
- రైతులతో ప్రత్యేక కమిటీలు
- త్వరలోనే అవగాహన కార్యక్రమాలు
- ఈ వానాకాలం నుంచే అమలుకు చర్యలు

జిల్లాలోని రైతులు : 1.45 లక్షలు
మండల కమిటీలు : 20
ఒక్కో కమిటీలో సభ్యులు : 125



ఆదిలాబాద్‌అర్బన్: ఆరుగాలం శ్రమించే అన్నదాత ఆరోగ్యంతో పాటు సాగులో తక్కువ పెట్టుబడితో అధికదిగుబడి సాధించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'సహజ వ్యవసాయం' (నేచురల్ ఫార్మింగ్) అనే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. రసాయనాలు వినియోగించి పండించే పంటలు కాకుండా ప్రకృతిసిద్ధంగా లభించే వాటితో సాగు చేయడం ఇందులో ప్రత్యేకం. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడం, స్థిరత్వం, నీటి ఆదా, నేల సారవంతం కాపాడడం, ఖర్చులు తగ్గించడం, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలు కాపాడుకోవడం అనేది ఈ విధానంతోనే సాధ్యమని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలో ఈ వానాకాలం నుంచి అమలు దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సహజ వ్యవసాయం ఇలా..

తక్కువ ఖర్చుతో పంటలు పండిస్తూ అధిక దిగుబడి సాధించి ఉపాధి పెంచడం సహజ వ్యవసాయంలో భాగమని అధికారులు చెబుతున్నారు. ఇందుకు స్థానికంగా లభించే విత్తన రకాలు వాడడం, విత్తన శుద్ధి కోసం పొలంలో ఉత్పత్తి చేసిన సూక్ష్మజీవుల వినియోగం, వాటి కార్యకలాపాల కోసం సూక్ష్మ వాతావరణాన్ని సృష్టించడం, సేంద్రియ ఎరువుల వాడకం, పంటల మార్పిడి, ఆవు పేడ, మూత్రం కోసం స్థానిక జాతి పశువులను పెంచడం, నేలను సుసంపన్నం చేయడం, నీరు, తేమ సంరక్షణ వంటివి సహజ వ్యవసాయం కిందకే వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ విధానం ద్వారా పండిన కూరగాయలు, ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలు అధిక పోషణ సాంద్రత కలిగి ఉండడం వల్ల మానవాళికి మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుంది. రసాయన మందులు వినియోగించకుండా సాగు ఏ విధంగా చేయాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులు వాడడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలు, వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, ప్రకృతి వైపరీత్యాలు తలెత్తడం వంటి సమస్యలకు సహజ వ్యవసాయం పరిష్కారం చూపుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ సీజన్ నుంచే అమలు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్ నుంచి సహజ వ్యవసాయం అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలువురు అధికారులు, శాస్త్రవేత్తలకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చినట్లు చెబుతున్నారు. వారు మండలానికి ఇద్దరు చొప్పున రైతులను ఎంపిక చేసి జిల్లాలో శిక్షణ ఇవ్వనున్నారు. మరోవైపు అర్బన్ మినహా ప్రతీ మండలంలో రైతులతో కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో 125 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. శిక్షణ పొందిన వారితో వీరికి అవగాహన కల్పిస్తారు.

త్వరలోనే గ్రామాల్లో సమావేశాలు

రైతులతో ఇప్పటికే ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశాం. ఒక్కో కమిటీలో 125 మంది వరకు ఉంటారు. త్వరలోనే ఇవి సమావేశాలు కానున్నాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించే సమావేశాల్లో సహజ వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పిస్తారు. జిల్లాలో ఈ వానాకాలం నుంచే సహజ వ్యవసాయం అమలు దిశగా చర్యలు చేపట్టాం.
– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

జన్నారం: మండలంలోని పొనకల్, ధర్మారం గ్రామాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా ఇసుక ట్రాక్టర్లు కనిపించడంతో పట్టుకుని సీజ్ చేసి సదరు ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రేపు అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

మంచిర్యాలక్రైం: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఈనెల 13న జిల్లాస్థాయి అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు క్రికెట్ కోచ్, జిల్లా కార్యదర్శి ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక విధానం రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల రూపంలో ఉంటుందని, ఈ మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 2006 సెప్టెంబర్ 1 తరువాత జన్మించి ఉన్నావారు మాత్రమే అర్హులన్నారు. అర్హత, ఆసక్తి కలవారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకుని ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు.

చెట్టుకొమ్మలు విరిగిపడి బైకులు ధ్వంసం



విరిగి పడిన చెట్టుకొమ్మ

నస్పూర్: సీసీసీ కార్నర్ సమీపంలోని ఓ మద్యం దుకాణం ఎదుట ఉన్న వేపచెట్టు కొమ్మలు బుధవారం గాలికి విరిగి పడడంతో చెట్టు కింద ఉన్న సుమారు 10 బైక్‌లు ధ్వంసమయ్యాయి. దీంతో పాటు కొమ్మలు విద్యుత్ వైర్ల మీద పడడంతో స్తంభం కిందకు వంగింది. దీంతో తీగలు సైతం కిందకి వేలాడి ప్రమాద కరంగ మారడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మద్యం దుకాణం ముందున్న ప్రజలకు ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్‌జీవో హౌసింగ్ సొసైటీపై విచారణ

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఎన్‌జీవోస్) హౌసింగ్ సొసైటీలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సహకార శాఖ రాష్ట్ర కమిషనర్ సురేంద్రమోహన్ బుధవారం విచారణకు ఉత్వర్వులు జారీ చేశారు. విచారణ అధికారిగా జిల్లా సహకారశాఖ సూపరింటెండెంట్ జి.హనుమంతరెడ్డిని నియమించారు. ప్లాట్ల కేటాయింపు, అర్హులు కాకుండా అనర్హులు ఉన్నారని, స్థలాల మధ్య వ్యత్యాసం, తదితర అక్రమాల ఆరోపణలపై 1995లో సెక్షన్ 29 ప్రకారం అప్పటి జిల్లా సహకార శాఖ అధికారి అందజేసిన నివేదిక ఆధారంగా విచారణ చేపట్టనున్నారు.

గురుకులాల్లో ఫోన్‌మిత్ర

- విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అమలు
- స్మార్ట్‌కార్డు ఆధారంగా ఫోన్ చేసుకునే సదుపాయం
- తల్లిదండ్రులతో స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశం
- విద్యార్థులకు తొలగనున్న ఇబ్బందులు



బెల్లంపల్లి సీవోఈ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోన్‌లు

బెల్లంపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో కొత్తగా ఫోన్‌మిత్ర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులు చీటికి మాటికి హోమ్ సిక్‌కు వెళ్లకుండా నివారించడం, గురుకులంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో ఫోన్‌మిత్ర సౌలభ్యం కల్పించారు. ఈ ప్రక్రియ ప్రస్తుత విద్యాసంవత్సరం ఆరంభం నుండి అమలయ్యే విధంగా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ చర్యలు చేపట్టింది. ఈ మేరకు గురుకులాల్లో ఫోన్‌లను ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని గురుకులాల్లో ఫోన్‌లను ఇప్పటికే బిగించగా మిగిలిన గురుకుల విద్యాలయాల్లో వేగవంతం చేశారు. నేటి నుంచి వేసవి సెలవులు ముగిసి విద్యాసంస్థలు పునఃప్రారంభం కానుండటంతో ఫోన్‌మిత్రను అందుబాటులోకి తీసుకురావడానికి తుది ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఉమ్మడి జిల్లాలో...

నిజామాబాద్ జోన్ పరిధిలోకి వచ్చే నిర్మల్ జిల్లా మినహాయించి ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో గరిష్ఠంగా 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరంతా అవసరాలకు అనుగుణంగా తల్లితండ్రులతో మాట్లాడుకోవడానికి ఇకపై హౌజ్ మాస్టర్‌తో సంబంధం లేకుండా నేరుగా స్మార్ట్‌కార్డు ఆధారంగా ఫోన్‌వద్దకు వెళ్లి కార్డుతో స్కాన్‌చేసి మాట్లాడుకోవచ్చు. నలుగురు విద్యార్థులకు కలిపి ఒక్కో స్మార్ట్‌కార్డు అందజేస్తారు. ఆ కార్డుతో నిర్ధేశించిన నిమిషాల పాటు స్వేచ్ఛగా తల్లిదండ్రులతో మాట్లాడుకోవచ్చు. ఇష్టారీతిన కాకుండా కుటుంబ సభ్యులకు చెందిన పేదేనీ ఓ ఫోన్ నంబర్‌కు మాత్రమే కాల్ వెళ్తుంది. వేరే ఇతర ఫోన్ నంబర్లకు కాల్ చేయడానికి అవకాశం ఉండదు. స్మార్ట్ కార్డు అందుకు యాక్సెప్ట్ చేయదు. కా గా గురుకుల విద్యాలయాల సంస్థ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. గురుకులంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించే అవకాశం ఫోన్‌మిత్ర ద్వారా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తల్లిదండ్రులకు ఫోన్ చేయడానికి ఇప్పటి వరకు క్లాస్ హౌజ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ లేదా ఎవరైనా పేరెంట్ గురుకులానికి వెళ్తే బ్రతిమాలి ఫోన్‌చేసే అవకాశం ఉండగా కొత్త విధానంతో విద్యార్థులు పడే ఇక్కట్లకు ఇకపై చెక్ పడనుంది.

ఒక్కో గురుకులంలో..

ఒక్కో గురుకుల విద్యాలయంలో కనిష్ఠంగా 6 నుంచి గరిష్ఠంగా 8 చొప్పున ఫోన్‌లను ఏర్పాటు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. అదే తీరుగా విద్యార్థుల సంఖ్యను బట్టి 140 నుంచి 160 వరకు స్మార్ట్‌కార్డులు గురుకులాలకు సరఫరా అయ్యాయి. అవసరమైతే మరిన్ని స్మార్ట్‌కార్డులు, ఫోన్‌లను అందజేయడానికి గురుకుల సొసైటీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా సంక్షేమ గురుకులాల్లోను ఫోన్‌మిత్రలను ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఫోన్‌మిత్ర ద్వారా గురుకులాల్లో ఫోన్‌లను బిగించే చర్యలు తుదిదశకు చేరుకున్నాయి. పాఠశాలల పున:ప్రారంభం నాటికి ఫోన్‌లను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పనులు వేగవంతం చేశాం. దాదాపు అన్ని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వీటిని ఏర్పాటు చేస్తాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– అరుణకుమారి, జోనల్ అధికారి, మంచిర్యాల

బావిలో దూకి మహిళ ఆత్మహత్య



కమలాబాయి (ఫైల్)

కౌటాల: వ్యవసాయ బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన ఉర్వత్ కమలాబాయి(56) కొంతకాలంగా మద్యానికి బానిసైంది. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలిస్తుండగా బావిలో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమి త్తం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఉర్వత్ బండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

కుభీర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కుభీర్‌కు చెందిన వేములవార్ అశోక్ (35) కుటుంబ తగాదాల కారణంగా కొంతకాలంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బుధవారం మండల కేంద్రం సమీపంలోని ప్రైవేటు ప్లాట్లలో ఉన్న ముళ్లపొదల్లో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసాకు తరలించారు. కాగా సంఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: యజమానిని తన సొంత స్థలంలోకి రానివ్వకుండా అడ్డుకోవడంతో పాటు హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1991, జూలై 31న బట్టిసావర్‌గాం గ్రామంలోని సర్వే నంబర్ 72లో 13 ఎకరాల 31 గుంటల భూమిని శ్రీ సత్యసాయి విద్యా విహార్ సంస్థకు జీవో 602 ద్వారా అప్పగించింది. శ్రీ సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ప్రకాష్, స్వామి ఇద్దరి మధ్య 20 ఏళ్ల క్రితం 5 ఎకరాల భూమిలో శ్రీ సత్యసాయి విద్యా నికేతన్ పాఠశాల నిర్మించుకున్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ ప్రకాష్ 2014, మేలో తన వృత్తిపరమైన బిజీ షెడ్యూల్ ఉండడంతో పాఠశాల నిర్వహణ బాధ్యతలను జి.స్వామికి అప్పగించారు. పాఠశాల ఆదాయంలో 20 శాతం వాటా ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఏడాది మే 2న ప్రకాష్ పాఠశాల సందర్శనకు వెళ్లగా స్వామితో పాటు అతని భార్య, కుమార్తె మమత, ఆదినాథ్, ఆర్.అమరేందర్‌తో పాటు పలువురు అడ్డుకుని గొడవకు దిగారు. అంతేకాకుండా కుటుంబ సభ్యులను హత్య చేస్తామని బెదిరించారు. సదరు వ్యక్తులు స్టాంప్ పేపర్లపై ప్రకాష్ సంతకాలు ఫోర్జరీ చేసి లీజుడీడ్‌ను తయారు చేసుకున్నారని ప్రకాష్ ఆరోపించారు. అతని ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికను వేధించిన ఒకరిపై పోక్సో కేసు

- కిడ్నాప్ కేసులో మరో ముగ్గురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: బాలుడిని అక్రమంగా నిర్బంధించిన ముగ్గురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జైనథ్ మండలంలోని బాలికను ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ బాలుడు ప్రేమపేరుతో వేధిస్తున్నాడని జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సోకేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రాళ్లబండి మహేందర్, పద్మావార్ రాకేష్, గంద్రత్ నరేందర్ ఆదిలా బాద్ పట్టణంలోని ద్వారకానగర్ మున్సిపల్ పార్క్ వద్ద ఈ కేసులో నిందితుడైన బాలుడిని పిలిచి అతని వద్ద నుంచి ఫోన్ లాక్కోవడంతో పాటు అక్రమంగా నిర్బంధించి లవ్ జిహాద్ చేస్తున్నావంటూ వాహనంలో కూర్చోబెట్టి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై అక్రమ నిర్బంధం, కిడ్నాప్, ఫోన్ స్నాచింగ్ సెక్షన్ల కింద వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని, ఎలాంటి సమాచారమైనా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. నేరం చేసే వారిని జిల్లా పోలీసు యంత్రాంగం వదిలిపెట్టదన్నారు. విద్యార్థినిలు, మహిళల వేధింపులకు ఆదిలాబాద్ షీటీం బృందాన్ని సంప్రదించాలని, అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

ఆర్జీయూకేటీ, స్విన్ఫీ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు బాసర ఆర్జీయూకేటీ, స్విన్ఫీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మధ్య బుధవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరినట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. ఓఎస్‌డీ మురళీదర్శన్, స్విన్ఫీ శిక్షణ బృందంలోని సీఈవో రాణి గుంటికడి సంతకాలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం గ్రామీణ యువతకు సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందన్నారు. వీరిని ఐటీ పరిశ్రమ అవసరాలకు తగినట్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయనున్నామన్నారు. ఇందులో భాగంగా ఆర్జీయూకేటీలో చివరి సంవత్సరం చదువుతున్న వందమంది విద్యార్థులకు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ అంశాలపై మూడునెలల పాటు ఇంటెన్సివ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ విట్టల్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మహేష్, డాక్టర్ ఎస్ విజయ్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు సుమశ్రీ వల్లపు, రాకేష్ గంజి, మహేష్ సద్దాలా, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న త్రినేత్ర శివాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్ప డ్డారు. గోడ దూకి ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు గర్భగుడి ద్వారం తాళాన్ని పగులగొట్టి శివలింగంపై ఉన్న వెండి నాగపడిగను అపహరించారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు విషయాన్ని గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భుక్తాపూర్‌లో ఇంట్లో..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన రహెమాన్ ఇంట్లో చోరీ జరిగినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఈనెల 3న కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన గోనధన్నూర్‌కు వెళ్లాడు. ఈనెల 11న ఇంటికి వచ్చిచూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న ఐదు గ్రాముల బంగారం, రూ.6వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మిస్సింగ్ కేసు నమోదు

తానూరు: మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన గాడేకర్ శేషారావు (35) అదృశ్యమైనట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. శేషారావు ఈ నెల 10న ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని వదినె గాడేకర్ శాంతాబాయి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'భూకబ్జాకు పాల్పడిన మహిళపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న బాధితులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ రడగంబాల బస్తీలో ఓ మహిళ ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్రజలను బెదిరింపులకు గురిచేస్తోందని బాధితులు బుధవారం బెల్లంపల్లి ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వేర్వేరుగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బాధితులు చీకటి మాధురి, ఎండీ రెహెనా బేగం, పెద్దపల్లి వరలక్ష్మి, చీకటి లక్ష్మి, ఎండీ షహనాజ్ మాట్లాడుతూ తామంతా కూ లీ పనులు చేసుకుని బస్తీలో నివాసం ఉంటున్నామన్నారు. ఎంతో కష్టపడి పక్కా గృహాలు కట్టుకుని జీవిస్తున్న తమను ఆర్పీ మాధవి బెదిరింపులకు గురి చేస్తోందన్నారు. అక్రమంగా రాత్రి పూట నిర్మాణాలు సాగిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారని, కొందరు పేదల గృహాలను కబ్జా చేయడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారని, ఇప్పటికే దాదాపు 40 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని వివరించారు. గతంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అడ్డుకోగా తిరిగి కబ్జాకు యత్నాలు సా గిస్తున్నారని వివరించారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి బస్తీలో సాగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే ఆపాలని, భూ క బ్జాలు జరగకుండా రెవెన్యూ అధికారులు ని వారించి, మాధవిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విత్తన చట్టం రూపకల్పనకు కృషి

- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

కైలాస్‌నగర్: నూతన విత్తన చట్టం–2025 రూపకల్పనలో రైతుల సూచనలు తీసుకుని త్వరలో అమలులోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన విత్తన చట్టం ముసాయిదా తయారీ కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ ఆర్గనైజర్లు, విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ విత్తన చట్టం ముసాయిదా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందరి సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని విత్తన చట్టం ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు. అంతకుముందు బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ

మంచిర్యాలఅర్బన్: తెలంగాణలోని ధూప, దీప, నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. బుధవారం మంచిర్యాల విశ్వనాథస్వామి కాలక్షేప మండపంలో అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 పీఆర్సీకి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడు నారాయణస్వామి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నవీన్, సీడీడీఎన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌స్వామి, డీడీఎన్ అధ్యక్షుడు సతీశ్‌శర్మ, ఈవో రవి, అర్చకులు నరహరిశర్మ పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



పట్టుకున్న విత్తనాలతో ఎస్సై, అధికారులు

తాండూర్: మండలంలోని బోయపల్లిలో బుధవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని గోండ్ పిప్పిరి గ్రామం నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు బోయపల్లి గ్రామ సమీపంలో మాటువేసి మాసాడి రవీందర్ అనే యువకుడు నకిలీ పత్తి విత్తనాలు తీసుకువస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుని వద్ద నుంచి 18 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సుష్మ పర్యవేక్షణలో పంచనామా నిర్వహించారు. విత్తనాల విలువ రూ.54 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భీమారం: మండలంలోని ఎలకేశ్వరంలో బుధవారం వ్యవసాయశాఖ, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి సూరం సురేష్ వద్ద 2 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏవో అత్తె సుధాకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సురేష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు.

మత్స్యసొసైటీ ఖాతాలో నగదు జమచేయాలి



మాట్లాడుతున్న లెల్లల బాలకృష్ణ

పాతమంచిర్యాల: మత్స్య సొసైటీలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు సరఫరా చేసేందుకు బదులుగా సొసైటీల ఖాతాలలో నగదు జమచేస్తే సభ్యులకు లాభదాయకంగా ఉంటుందని తెలంగాణ మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చార్వక ట్రస్ట్ భవన్‌లో మత్స్య కార్మిక సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ, ఎన్‌ఎఫ్‌డీ స్కీంలను పునరుద్ధరించాలని, మత్స్యకారులకు టూవీలర్, ఫోర్ వీలర్ వాహనాలు 90 శాతం సబ్సిడీపై మంజూరు చేయాలన్నారు. మత్స్యకారులు ప్రమాదాల బారిన పడి చనిపోతే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సహజ మరణానికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో పది ఎకరాల్లో అధునాతన చేపల మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు, నాయకులు గుమ్ముల శ్రీనివాస్, పెద్దపల్లి మధునయ్య, పందిరి రమాదేవి, లెల్లల మల్లీశ్వరి, బానెం నాగన్న, నాగుల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నావదిన... దీవించండి



అన్నావదినకు మొక్కుతున్న మంత్రి వివేక్

బెల్లంపల్లి: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం వివేక్ తన సోదరుడు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, వదిన రమ ఆశీర్వాదం తీసుకున్నారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి వివేక్ హైదరాబాద్‌లో ఉన్న తన సోదరుడి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా అన్నా వదినల కాళ్లకు సమస్కారం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఎల్లప్పుడు ఇలాగే తనపై ప్రేమానురాగాలు ఉండాలని వివేక్ తన సోదరుడిని కోరారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేను కాంగ్రెస్ నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, మునిమంద రమేశ్, కేపీ ప్రతాప్, హరీష్ గౌడ్, ఎం.మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో జ్యేష్ఠపౌర్ణమి జాతర..



సామూహిక వ్రతాలు నోముతున్న భక్తులు

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 230 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా కనిపించింది.

– దండేపల్లి



సత్యదేవుని దర్శనానికి బారులు తీరిన భక్తులు